ఇన్‌సర్వీస్ పిజి డాక్టర్లను అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలి

- మంత్రి దామోదరకు టిపిహెచ్‌డిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌సర్వీస్ పీజీ డాక్టర్లను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ల్యాటరల్ ఎంట్రీ ద్వారా వెంటనే నియమించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టిపిహెచ్‌డిఎ) కోరింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ నేతృత్వంలో ప్రతి నిధులు మంత్రిని కలిసి నేరుగా అబ్జార్బ్ చేయాలని విన్నవించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పునరుద్ధరించిన ఇన్‌సర్వీస్ కోటా ద్వారా తొలి బ్యాచ్ 2021లో ప్రవేశించి 2025లో స్పెషలిస్ట్ ఇన్‌సర్వీస్ వైద్యులు కోర్సు పూర్తి చేసుకుని ఉన్నారని తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం సుమారు 150-250 మంది ఇన్‌సర్వీస్ పిజి వైద్యులు వివిధ స్పెషాలిటీల్లో పట్టభద్రులు అవుతారన్నారు. వీరిని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) పరిధిలోని మెడికల్ కాలేజీల్లో నేరుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకుంటే ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం ఉండదని చెప్పారు. విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ కొరత వెంటనే తీరుతుందని వెల్లడించారు. ఇప్పటికే ప్రభుత్వ సేవల్లో ఉన్న డాక్టర్లను వైద్య విద్యా రంగంలో సమర్థవంతంగా వినియోగించవచ్చన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు ఈ మోడల్‌ను అనుసరి స్తున్నాయని వారు వివరించారు. దీనిపై మంత్రి సాను కూలంగా స్పందించినట్టు నాయకులు తెలిపారు. అనంతరం వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి, డిఎంఇ డాక్టర్ నరేందర్ కుమార్, డిహెచ్, కుటుంబ సంక్షేమ కమి షనర్లకు వినతిపత్రాలను అందజేశారు. వైద్యవిద్య బలోపేతానికి ప్రభుత్వానికి అన్ని విధాలు సహాయ, సహకారాలు అందిస్తామని వారు చెప్పారు.

తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించండి

- క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి
- క్రీడాకారులకు రైలు ప్రయాణ ఛార్జీల్లో రాయితీ పునరుద్ధరించండి
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

కేంద్ర మంత్రి మాండవీయకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ఇండియా గేమ్స్-2026ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్. మాండవీయకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయను ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణులఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సిఎం రేవంత్ కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్ హాల్, హైదరాబాద్ హకీంపేట్ లో అర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్.బి.స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్రీడా వసతుల మెరుగుకు అన్నివిధాలా కృషి చేస్తోందని... కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం ఇవ్వాలని కోరారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఇవెంట్లు తెలంగాణలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరే రైలు ప్రయాణాల్లో ఛార్జీ రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎపి జితేందర్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

తెలంగాణలో క్రీడా రంగం అభివృద్ధిపై కపిల్ దేవ్ ప్రశంస...

ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడా రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామినవుతానని ఆయన తెలిపారు. ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో కపిల్ దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కపిల్ దేవ్‌కు సిఎం వివరించారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు.. అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో అభివాదం చేస్తున్న జూలకంటి, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సమ్మెతో మోడీ ప్రభుత్వానికి దిమ్మతిరగాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- హుజూర్‌నగర్‌లో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా 9వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెతో మోడీ ప్రభుత్వానికి దిమ్మ తిరగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సమ్మె విజయవంతం కోసం సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంపద మొత్తం కొల్లగొట్టి ప్రభుత్వ రంగంలో ఉన్న వివిధ కంపెనీలను పూర్తిగా బడా కార్పొరేట్ చేతుల్లో పెడుతోందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల సంపదను దోచి ముగ్గురు, నలుగురు చేతిలో పెడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మాత్రం విఫలమైందన్నారు. బిజెపి అధికారంలో లేని రాష్ట్ర ప్రభుత్వాలను పెట్టే కార్యక్రమాలు సాగిస్తోందన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి సమ్మెతో కండ్లు తెరిపించాలని అన్నారు. సమ్మెలో వ్యాపార వర్గాలు, ఉద్యోగస్తులు, రైతు, కూలీలు, సకలజనులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం శ్రీను, ఎలుక సోమయ్యగౌడ్, జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం వెంకటనారాయణ, రేపాకుల మురళి, చిన్నం వీరమల్లు, తురక వీరయ్య, పిట్టల నాగేశ్వరరావు, రేపాకుల వీరస్వామి పాల్గొన్నారు.

నేడు వైఎస్ జయంతి

- పాండిచ్చేరి మాజీ సిఎం రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా టిపిసిసి ఆధ్వర్యంలో నేతలు నివాళులర్పించనున్నారు. హైదరాబాద్ పంజగుట్టలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొని నివాళులు అర్పించనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు గాంధీ భవన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా నేతకు నివాళులర్పించాలని టిపిసిసి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఫార్మా లేఅవుట్ భవిష్యత్తులో మహానగరం

- ఇక్కడి భూములకు మార్కెట్‌లో కోట్ల విలువ : ఎమ్మెల్యే రంగారెడ్డి
- బిఆర్ఎస్ హయాంలోనే ప్లాట్ల కేటాయింపు : సబితా ఇంద్రారెడ్డి
- ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు లాటరీ పద్ధతి ద్వారా ప్లాట్ల పంపిణీ

ప్లాట్ల పంపిణీ కార్యక్రమంలో పాలకులు, ప్రభుత్వ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే కాలంలో ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ వల్ల అద్భుతమైన మహానగరం కాబోతున్నట్టు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన యాచారం, కందుకూరు మండలాల రైతులకు నష్టపరిహారంతోపాటు ప్లాట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేట్, పంజాగుట్ట రెవెన్యూ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భూ నిర్వాసితులకు లాటరీ పద్ధతి ద్వారా ప్లాట్ల పంపిణీ చేశారు. మొదట యాచారం మండలం కురిమిద్ద రెవెన్యూ ఫార్మా రైతులకు ప్లాట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫార్మాసిటీని గ్రీన్ సిటీగా మార్చడం కోసం సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ 320 ఫీట్ల రోడ్డు ఫార్మా లేఅవుట్ నుంచే వెళ్తోందని, తద్వారా రాబోయే కాలంలో ఇక్కడి భూములు కోట్లలో ధర పలుకుతాయన్నారు. ఎవరూ ప్లాట్లు అమ్ముకోవద్దని సూచించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం అందజేసినట్టు చెప్పారు. ప్రతి రైతుకూ భూమికి పరిహారంతోపాటు ఎకరానికి 121 గజం చొప్పున ప్లాట్లు కేటాయించినట్టు చెప్పారు. మాజీ సిఎం కెసిఆర్ ఫార్మా రైతుల మేలు కోరి పరిహారం, ప్లాట్లు కేటాయించడం ఎంతో సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ రైతులకు ప్లాట్ల పంపిణీలో కాలయాపన చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఫార్మా రైతులకు ప్లాట్లు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు.

లాటరీ ద్వారా ప్లాట్ల పంపిణీ : జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

యాచారం మండలం కురిమిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపత్రి, కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేట్, ముచ్చర్ల, పంజాగుట్ట రెవెన్యూ గ్రామాల్లో ఫార్మా రైతులకు లాటరీ ద్వారా ప్లాట్ల పంపిణీ చేసినట్టు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సీరియల్ ప్రకారం, లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించామన్నారు. మూడ్రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఫార్మా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం మూడంచెల విధానంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫార్మా రైతులు, ప్రొసీడింగ్ ఉన్న వారినే పోలీసులు అనుమతిచ్చారు.

విద్యే విద్యార్థుల పాత్రను నిర్దేశిస్తుంది

- గవర్నర్, కెయు ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ
- సవాళ్లే ఎదుగుదలకు అవకాశాలు
- ఐఐసిటి డైరెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి

కెయు స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో విద్యనే విద్యార్థుల పాత్రను నిర్దేశిస్తుందని రాష్ట్ర గవర్నర్, కాకతీయ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. పట్టభద్రులకు, గోల్డ్‌మెడల్స్ సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ (కెయు) 23వ స్నాతకోత్సవంతో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సవాల్ మీ విజయానికి పునాది అవుతుందన్నారు. ప్రతి శాస్త్రవేత్త, ఆవిష్కర్త, దూరదృష్టి కలిగిన వారంతా యూనివర్సిటీల్లో విద్యార్థులుగా తమ ప్రస్థానాన్ని ప్రారంభించినవారేనని తెలిపారు. స్థానిక భాషలు, ప్రపంచ ప్రమాణాలు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలతో ఎదుగుదలకు నూతన జాతీయ విద్యావిధానం-2020 తోడ్పాటునిస్తుందన్నారు. శాంతి స్వరూప్ భట్నాగార్ అవార్డు గ్రహీత, సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సవాళ్లను ఎదుగుదలకు అవకాశాలుగా మలుచుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తాను ఎలాంటి విలాసవంతమైన అర్హతలు లేకున్నా ఐఐసిటి వంటి ప్రతిష్టాత్మక జాతీయ సంస్థ సైంటిస్ట్ కావడం జరిగిందన్నారు. ప్రతి సవాలు విజయానికి సోపానమవుతుందని తెలిపారు. భాష.. ఎదుగుదలకు అడ్డంకి కాదని, భాష ఆలోచనలకు, లక్ష్యానికి సాధనగా ఉంటుందన్నారు. 2047కి దేశానికి స్వాతంత్య్రం వచ్చి వందేండ్లు పూర్తవుతుందన్నారు. కేవలం ప్రభుత్వ విధానాలతోనే జాతీయ దృక్పధాన్ని సాధించలేమని తెలిపారు. యువత సృజనాత్మకతతో, శక్తితోనే సాధ్యమవుతుందన్నారు. ఐఐసీటీలో తయారు చేసిన ముడి రసాయనాలతోనే భారత్ బయోటెక్ కోవిడ్-19 వ్యాక్సిన్ కోవాగ్జిన్‌ను తయారుచేసిందని తెలిపారు. దేశంలో 50 శాతం మందులు హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఫార్మా హబ్‌గా ఏర్పడిందన్నారు. బోయిన్‌పల్లి వద్ద ఐఐసిటి నేతృత్వంలో 10 టన్నుల చెత్తతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. వస్తు ఉత్పత్తుల్లో ప్లాస్టిక్ కీలకంగా మారిందన్నారు. ఐఐసిటి ఇచ్చే ముడి పదార్థాలతోనే అనేక కంపెనీలు ప్లాస్టిక్‌ను తయారు చేసి వివిధ ఉత్పత్తులను రూపొందిస్తున్నాయని తెలిపారు. కెయు విసి ప్రొఫెసర్ కె ప్రతాప్‌రెడ్డి యూనివర్సిటీ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం 387 మంది అభ్యర్థులకు పిహెచ్‌డి పట్టాలను, 564 మంది అభ్యర్థులకు గోల్డ్‌మెడల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, పూర్వ వైస్‌ఛాన్స్‌లర్లు లింగమూర్తి, బి. వెంకటరత్నం, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎంపి సీతారాంనాయక్, విసి ప్రొఫెసర్ కె ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రర్ ప్రొఫెసర్ రామచంద్రంతోపాటు అకాడమిక్ సెనేట్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎస్ఎఫ్ఐ నేతలు

రాష్ట్ర గవర్నర్‌ను అడ్డుకుంటారనే నెపంతో హన్మకొండ జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్‌తో పాటు పలువురు నేతలను కెయు పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేయూ భూములను యంగ్ ఇండియా స్కూల్ కాంప్లెక్స్‌కు కేటాయించవద్దని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గవర్నర్ కార్యక్రమానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

భూ నిర్వసితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చంద్రకళ

న్యాయం చేయకుండా భూమిలిచ్చేది లేదు..

- ఎన్కేపల్లి గోశాల భూ నిర్వాసితుల స్పష్టీకరణ
- రైతులకు సమాచారం ఇవ్వకుండానే భూమి పూజ కార్యక్రమం
- రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసిన ఆర్‌డిఒ చంద్రకళ
- ఎన్కేపల్లి గ్రామంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు న్యాయం చేయకుండా తమ భూములు ఇచ్చేది లేదని ఎన్కేపల్లి గోశాల భూ నిర్వాసితులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గోశాల భూనిర్వహితులు ఆందోళన చేపట్టారు. తమకు సరైన న్యాయం చేయకుండా భూమి పూజ ఎలా చేస్తారని నిరసన తెలిపారు. అదే సమయంలో భూమిపూజ చేయడానికి వచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను చుట్టు ముట్టారు. 70 ఏళ్లుగా భూమి సాగు చేస్తున్నామని తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అయినా అధికారులు బిజెసిలతో భూమిని సర్వే చేసే ప్రయత్నం చేశారు. రైతులు ఒక్కసారిగా వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆర్డీఓ చంద్రకళ రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా రైతులు అక్కడే ధర్నాకు దిగారు. ఈ క్రమంలో పోలీసుల సాయంతో ఎమ్మెల్యే కారు ఎక్కి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 180లో ఉన్న 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిలో దాదాపు 70 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమ నుంచి భూములను లాక్కోవాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని అన్నారు. సరైన పరిహారం దౌర్జన్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో పోలీసులను మొహరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రమదోపిడీని చట్టబద్ధం చేసే జిఒల ఉపసంహరించాలి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పనిగంటల పెంపు మేడే పోరాట ఫలాన్ని పాతిపెట్టడమే అవుతుందని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ విమర్శించింది. శ్రమదోపిడీని చట్టబద్ధం చేసే కార్మిక జీవోలను ఉపసంహరించు కోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కుల మీద దాడి చేస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారుల లాభాల కోసం వేతన జీవుల శ్రమను అదనంగా దోచుకోవడానికి సంకల్పించిన విధానమని తెలిపారు. బిజెపి బాటలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఎపిలో టిడిపి ప్రభుత్వం, గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఇది కార్మిక వ్యతిరేక చర్య, కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారుల లాభాల దాహం తీర్చడానికి వారితో కుమ్మక్కై చేసిన చర్య అని పేర్కొన్నారు. ఈ జిఒను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కార్మికుల నిజ వేతనాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థల లాభాల శాతం పెరుగుతున్నదని వివరించారు. ఈ స్థితిలో కార్మికుల వేతనాలను పెంచడం, పనిభారం తగ్గించడం చేయాలని పేర్కొన్నారు.

ఒలింపిక్స్‌కు అథ్లెట్లను తయారు చేస్తాం

- సమృద్ధికరమైన భవిష్యత్‌కు మార్గం క్రీడలు
- క్రీడలు, మత్స్యశాఖ మంత్రి వాకటి శ్రీహరి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రులు వాకటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నుంచి ఒలింపిక్స్ అథ్లెట్లను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, క్రీడలు అంటే కేవలం సరదా కాదు.. సమృద్ధికరమైన భవిష్యత్‌కు మార్గం అని క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకటి శ్రీహరి తెలిపారు. ప్రపంచం గర్వించే అథ్లెట్లను తయారు చేస్తామన్నారు. సోమవారం రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన కరీంనగర్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాత ఆర్ట్స్ కాలేజ్ వద్ద రూ.36 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో రూ.26 లక్షలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించారు. జిమ్నాస్టిక్ కోర్టు, సింథటిక్ ట్రాక్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్మీడియట్ స్థాయికి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. 'క్రీడలపైనే విద్యార్థుల శ్వాస, ధ్యాస ఉండాలి. రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌ను తెలంగాణలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం. విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబరిచి తెలంగాణ గర్వించేలా చేయాలి' అని అన్నారు. అంబేద్కర్ స్టేడియంలోని వాకింగ్ ట్రాక్, ఇండోర్ గ్రౌండ్‌లను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కరీంనగర్ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో 400 మీటర్ల ట్రాక్, సైక్లింగ్ వెలోడ్రోమ్, హ్యాండ్‌బాల్ కోర్టులు, ఖో-ఖో వాలీబాల్ మైదానాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరముందని సూచించారు.

మత్స్యశాఖను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

కరీంనగర్ ఉజ్వల పార్క్ సమీపంలో చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని మంత్రులు పరిశీలించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, 82 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేయనున్నట్టు మంత్రి శ్రీహరి ప్రకటించారు. 'మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేలా మత్స్య శాఖను నిర్మించనున్నాం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ శాఖను అవినీతికి వేదికగా మార్చింది. మేము పారదర్శకతతో ముందుకెళ్తాం' అని తెలిపారు. ఇదే సందర్భంలో 'కరీంనగర్ జిల్లా చేపల ఉత్పత్తి మొదటి స్థానంలో ఉంది. మత్స్యకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు మార్కెట్ మద్దతు కూడా కల్పిస్తాం' అని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు వల్ల చేపల ధర పెరిగిన తర్వాత అమ్ముకునే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం లోయర్ మానేరు డ్యాం పరిసరాల సప్తగిరి కాలనీలో జరిగిన వనమహోత్సవంలో మంత్రులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణరావు, సంజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జిఒ కాపీలను కాల్చివేస్తున్న నాయకులు

పదిగంటల పని విధానాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే

- జిఒ నెంబర్ 282ను రద్దు చేయాలి
- జిఒ కాపీలను కాల్చివేసిన నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదిగంటల పని విధానాన్ని వెనక్కి తీసుకోవాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర కార్మిక నేతలు పట్టుబట్టారు. జిఒ నెంబర్ 282ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. జీవో నెంబర్ 282 ప్రతులను కాల్చేశారు. అనంతరం క్రాస్‌రోడ్స్ నుంచి అంజయ్య భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ జిఒను రద్దు చేయాలని కోరుతూ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు క్రాస్‌రోడ్స్‌లో సిఐటియు సిటీ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, ఎఐటియుసి సిటీ కార్యదర్శి బాలరాజు అధ్యక్షతన జరిగిన నిరసనలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి అనూరాధ, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, ఎఐటియుసి రాష్ట్ర ఇన్‌చార్జి భరత్ మాట్లాడారు. తెలంగాణ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988లోని సెక్షన్ 16, 17లను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 282ను తీసుకురావడం దారుణమని విమర్శించారు కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, కూరపాటి రమేష్, పి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, విఎస్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్పొరేట్, మతోన్మాద విధానాలను నిరసిస్తూజూలై తొమ్మిదిన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె కు ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. మైనారిటీలు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 11 సంవత్సరాల బిజెపి పాలన దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, కార్మికులను, రైతులను, దళిత, గిరిజన, మైనారిటీ, మహిళలు తదితర సామాజిక తరగతులను అణిచివేస్తున్నదని అన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులు దోపిడి చేసేందుకు అనువుగా కార్మిక చట్టాలు తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదని దోచిపెడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగం, పేదరికం, అధిక ధరలతో ప్రజలు కనీసం ఏమీ కొనలేని పరిస్థితిలో ఉన్నారని, ఈ సమస్యల నుండి ప్రజల దష్టిని మరల్చడానికి మతోన్మాద విధానాలతో మత విద్వేషం రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభజన తెచ్చి హింసను ప్రేరేపించే విధానాలను అమలు చేస్తున్నారని అన్నారు. జూలై 9న జరుగుతున్న సమ్మెలో ప్రజలందరూ పాల్గొని బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు.

60 ఎమ్మెల్యే సీట్లు మహిళలకే..

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారికే ప్రాధాన్యత..
- ఈ సంవత్సరం 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం
- వన మహోత్సవంలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి, వారిని గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను విస్మరించిందని ఆరోపించారు. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని బయోడైవర్సిటీ పార్కులో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి రుద్రాక్ష మొక్కను సిఎం నాటి వనమహోత్సవం-2025ను ప్రారంభించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడారు. వనమే మనం, మనమే వనం అని పెద్దలు చెప్పారని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులందరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని దేశ ప్రధాని పిలుపునిచ్చారని, ప్రధాని పిలుపును ఆహ్వానిస్తూ.. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలని అన్నారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల క్యాబినెట్‌లో మహిళా మంత్రి కూడా లేరని విమర్శించారు. అన్నిరంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. చెట్లను పెంచడం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు. అడవుల్లో చెట్లను నరకడం వల్ల కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని, అటవీ సంపద పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు, నరసింహారెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్‌కెఎం రాష్ట్ర కమిటీ నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- 8న గ్రామాలు, 9న మండల, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు
- ఎస్‌కెఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల తొమ్మిదిన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, జక్కుల వెంకటయ్య, డిజి నరేంద్ర ప్రసాద్, ఆర్.వెంకట్రాములు, ఇ.విజయ్ మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా జూలై ఎనిమిదిన గ్రామీణ ప్రాంతాల్లో, తొమ్మిదవ తేదీన మండల, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని కోరారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకు రావడం ద్వారా కార్మికులకు మోడీ సర్కార్ తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. 13 నెలల పాటు రైతులు చేసిన పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ విధాన ముసాయిదా పత్రంతో రద్దుచేసిన మూడు చట్టాలను దొడ్డి దారిన తెచ్చేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని వారు విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం వెనక్కి తీసుకోవాలనీ, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బడా కార్పొరేట్ సంస్థలకు రూ. లక్షల కోట్లు మాఫీ చేస్తున్న మోడీ ప్రభుత్వం, రైతులకు రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనీ, స్వామినాథన్ కమిటీ సిఫారులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరుతుంటే, ఆ చట్టానికి బడ్జెట్లో కేంద్రం నిధులు తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆరేళ్ల చిన్నారి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముక్కుపచ్చలారని ఆరేళ్ల చిన్నారి గుండె ఆగిపోయింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గోవింద్ అశోక్, అనూష దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఉపాధి కోసం వీరు హైదరాబాద్‌కు వెళ్లారు. అశోక్ అక్కడే ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా, రెండో కుమార్తె మిథున (6) శనివారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందంటూ.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే తల్లిదండ్రులు ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా పాప మృతి చెందింది. కాగా, గుండె పోటుతో తమ కుమార్తె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని తల్లిదండ్రులు తెలిపారు. ముక్కు పచ్చలారని చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాలుకు సర్జరీ.. బాలుడి మృతి

- హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలుకు శస్త్రచికిత్స చేసిన అనంతరం ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన బంజారాహిల్స్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జరిగింది. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ ప్రాణం తీసిందని బంధువులు ధర్నాకు దిగారు. వివరాల్లోకెళ్తే.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాలుని (7) కాలుకు ఏడు నెలల కిందట కుటుంబీకులు బంజారాహిల్స్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇటీవల కాలులో చీము వచ్చి ఇన్‌ఫెక్షన్ ఏర్పడింది. దాంతో బాలుడిని మళ్లీ మూడ్రోజుల కిందట అదే ఆస్పత్రిలో చేర్చారు. ఆదివారం బాలుడి కాలుకు డాక్టర్లు మరోసారి ఆపరేషన్ నిర్వహించారు. అయితే సోమవారం ఉదయం బాలుడు గుండెపోటుతో మృతిచెందాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దాంతో బాలుడి కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. కాలు చికిత్స కోసం తీసుకొస్తే.. గుండెపోటు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి వారితో మాట్లాడారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత బాలుడి మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

మూడు నల్ల చట్టాలు రద్దు చేసినా..

కొత్త రూపంలో ముందుకు..

- మోడీ నిర్బంధ విధానాలతో 760 మంది రైతులు మృతి
- 12 గంటల శ్రమ దోపిడీని అడ్డుకుంటాం
- వాగ్దానాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- 9న దేశవ్యాప్త సమ్మెకు ఊరూవాడ కదలాలి : తమ్మినేని

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడు నల్ల చట్టాలను ప్రజా ఉద్యమాలకు తలొగ్గి రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం.. కొత్త రూపంలో అమలు చేసేందుకు పూనుకుంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం అన్నారు. 12 గంటల పని విధానంపై జిఒ తెస్తూ కార్మిక శ్రమదోపిని దోచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ నెల తొమ్మిదిన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా స్థాయి సమావేశం ఇబ్రహీంపట్నం పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్‌తో కలిసి తమ్మినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. మోడీ పాలనలో తెచ్చిన నల్ల చట్టాలపై పోరాటంలో 760 మంది రైతులు మృతి చెందారని తెలిపారు. వ్యవసాయ రంగంతో పాటు వివిధ వృత్తులను నాశనం చేసేందుకు విదేశీ వస్తువులపై దిగుమతి సుంకాన్ని రద్దు చేసేందుకు అమెరికాతో మోడీ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని అన్నారు. ఇదే అమలైతే దేశంలోని వ్యాపార వర్గాలు, వ్యవసాయ రంగం, పరిశ్రమలు పూర్తిగా నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదన్నారు. తాను 1997లో ఎంపీగా ఉన్నప్పుడు ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించినట్టు గుర్తు చేశారు. నేటికి 25 ఏండ్లు పూర్తయినా పాలక ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర గడుస్తున్నా వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న రూ.12 వేలు అమలకు నోచుకోలేదన్నారు. 43 లక్షల కుటుంబాల వ్యవసాయ కార్మికులు ఉంటే ఐదు లక్షల కుటుంబాలకే ఇస్తామని, అది కూడా రూ.6వేల చొప్పున అందజేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రతి మహిళకూ నెలకు రూ.2500 ఆర్థిక సాయం ఇవ్వడం లేదన్నారు. కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎందుకు మరిచిందని ప్రశ్నించారు. దేశంలో వృత్తులు దెబ్బతింటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఉద్యోగాల కల్పన అటకెక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమ్మెలో ఊరూవాడ కదిలి రావాలని పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధం కావాలని సిపిఎం పార్టీ శ్రేణులకు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పార్టీ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. కొన్ని మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకుని చక్రం తిప్పిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఒంటరి పోరు చేసేందుకైనా సిద్ధం కావాలన్నారు. ఎన్నికల్లో లౌకిక, ప్రజాతంత్ర శక్తులను కలుపుకొనిపోతామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పగడాల యాదయ్య, చంద్రమోహన్, మధుసూదన్ రెడ్డి, కందుకూరి జగన్, సుమలత, కవిత, ప్రకాష్ కరత్, శంకర్, పంది జగన్, గణేష్, విజయమ్మ, సామెల్, ప్రణయ్, నరసింహ, అంజయ్య, రామచందర్, జంగయ్య బుగ్గ రాములు ఎల్లేశం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో పెట్రోల్ పోసుకున్న రైతు

- తన భూమిని ఇతరుల రికార్డుల్లో ఎక్కించారని ఆవేదన

కంటి నీరు పెట్టుకున్న బాధిత రైతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన భూమి ఇతరుల పేరుతో రికార్డుల్లో ఎక్కడంతో మార్చాలంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందిన రైతు ప్రజావాణికి వచ్చి పెట్రోల్ పోసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిరసన వ్యక్తం చేశాడు. ఇందుకు సంబంధించి బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన చెందిన తడకపల్లి ఆగిరెడ్డి 2005లో బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామ సర్వే నెం. 340, 345, 346లో సుమారు రెండున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. అప్పటి ప్రభుత్వం పట్టా పాస్‌బుక్కు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టాన్ని తీసుకొచ్చాక అందులోకి ఎక్కించకపోవడంతో కొత్త పాసుపుస్తకం రాలేదు. పైగా ఆ భూమి సింగిరెడ్డి మహిపాల్‌రెడ్డి పేరున రికార్డులో ఎక్కింది. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినప్పటికీ, జిల్లా కలెక్టర్‌కు విన్నవించినప్పటికి బాధితునికి న్యాయం జరగలేదు. దీంతో మనస్తాపం చెంది కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి జరుగుతున్న సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు వెంటనే అతన్ని సముదాయించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏమి జరిగిందని కలెక్టర్ ఆరా తీయగా.. నాగినేనిపల్లి గ్రామంలో తాను కొనుగోలు చేసిన భూమిని తహసీల్దార్ తన పేర పట్టాదారు పాసుపుస్తకంలో ఎక్కించడం లేదని రైతు వాపోయాడు. పైగా తన పేరు మీద ఉన్న భూమిని సింగిరెడ్డి మహిపాల్‌రెడ్డి పేర ఎక్కించారని చెప్పాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

భువనగిరిలో లింగనిర్ధారణ పరీక్షలు

- ఇద్దరు మహిళలకు అబార్షన్
- తనిఖీలు చేసిన ఎస్ఒటి పోలీసులు.. అదుపులోకి డాక్టర్

వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు తెలిసింది. చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, ఇద్దరు మహిళలకు అబార్షన్ చేసిన విషయం ఎస్ఒటీ పోలీసుల తనిఖీల్లో బహిర్గతమైంది. భువనగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి రెండు గంటల సమయంలో పట్టణంలోని గాయత్రి ఆస్పత్రిలో లింగ నిర్ధారణ తర్వాత అబార్షన్ చేస్తున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరికి అబార్షన్ చేసి అబ్జర్వేషన్‌లో ఉంచారు. పరిశీలించాక ఆస్పత్రి డాక్టర్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన డయగ్నొస్టిక్ సెంటర్‌ను కూడా తనిఖీ చేశారు. గాయత్రి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ శివకుమార్‌పై గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా కేంద్రంతోపాటు మారుమూల మండలాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తున్నట్టు పలు ఆరోపణలు వస్తున్నా జిల్లా వైద్య శాఖ పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గత నెలలో ప్రత్యేక కమిటీ వేసి ఆస్పత్రులు, డయగ్నొస్టిక్ సెంటర్లను పరిశీలించారు. సరైన సౌకర్యాలు లేని వాటిని నోటీసులు ఇచ్చారు. కానీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో లింగనిర్ధారణ ఘటనలు కొనసాగుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ

ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలి. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు ఎప్పటికప్పుడూ తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లను పరిశీలించాలి. డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అన్నంలో పురుగులొస్తున్నయ్

- ఎల్లారెడ్డిలోని గిరిజన బాలికల గురుకుల విద్యార్థినులు రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'అన్నంలో పురుగులొస్తున్నయ్.. తమ సమస్యను పరిష్కరించాలి' అని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు మాట్లాడుతూ.. అన్నం తినే సమయంలో తరచుగా పురుగులు వస్తున్నాయని, ఈ విషయంపై పలుమార్లు ప్రిన్సిపల్‌కు, అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైటాయించడంతో ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి తహసీల్దార్ ప్రేమ్ కుమార్ విద్యార్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దాంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

గిరిజన బాలికల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు రాస్తారోకో చేయడంతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ గిరిజన బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని డైనింగ్ హాల్, స్టాక్ రూమ్, వాష్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను విన్న అదనపు కలెక్టర్ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సమస్యలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

10న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్‌ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా జరుగనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్నఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళాను నిర్వహించనున్నారు. మెడ్‌ప్లస్ ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన వంద పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డీ ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ, యువకులకు18 నుంచి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్టు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాలకు హెచ్ఆర్ సాయి శైలేష్‌ను ఫోన్ నెంబర్ 9666662481లో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్దకు నేరుగా గురువారం హాజరు కావాలని సూచించారు.

వెల్‌నెస్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్లను ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల వెల్‌నెస్ సెంటర్లలో లోపాలపై వస్తున్న ప్రచారంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, ఉన్నతాధికారులు గత రెండు రోజులుగా వనస్థలిపురం, ఖైరతాబాద్, కూకట్ పల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట్, మహబూబ్ నగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ కేంద్రాలను పరిశీలించారు. ఔషధాలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఇతర అంశాలపై అధికారులు ఆరా తీశారు.

'డబుల్' ఇళ్లల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఎస్‌టిపిని ఉపయోగంలోకి తీసుకురావాలి
- జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు సోమవారం హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డబుల్‌బెడ్ రూం కమిటీ అధ్యక్షులు వి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పరుశరామ్, సభ్యులు జీ.దేవేందర్ గౌడ్ మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని అహ్మద్‌గూడలో తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో 4300 మంది నివాసముంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఎస్‌టీపీని ఉపయోగంలోకి తీసుకురాలేదన్నారు. తొమ్మిది అంతస్థులతో నిర్మించిన ఆ ఇండ్లలో మెయింటనెన్స్ లేదన్నారు. కరెంట్ పోతే లిఫ్ట్‌లు పని చేయవని, జనరేటర్స్‌ను ఏర్పాటు చేయలేదని తెలిపారు. నిర్వహణ సరిగా లేనందున డ్రయినేజీ సమస్య తీవ్రమవుతోందన్నారు. దాంతో కింది అంతస్థుల్లో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఎస్‌టీపీని ఉపయోగంలోకి తీసుకునిరావాలని, జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ సత్వరమే న్యాయం చేస్తామని హామీనిచ్చారని బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్ రూం కమిటీ సహాయ కార్యదర్శి రవిమోహన్, జాన్సీప్రియా, నిర్మల, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

బిఎఎస్ విద్యార్థుల పట్ల వివక్ష

- కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎఎస్ (బెస్ట్ అవైలబుల్ స్కీం) పథకంలో ఎంపికైన దళిత విద్యార్థుల పట్ల వివక్ష చూపడాన్ని నిరసిస్తూ తల్లిదండ్రులు సోమవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు దళిత విద్యార్థుల పట్ల వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా వేరొక ఒకచోట కూర్చోబెడుతున్నారని, అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. నల్లగొండ ఆల్ఫా పాఠశాలలో విద్యార్థులు పెడుతున్నారని, యాజమాన్యంపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారన్నారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి.. పాఠశాల యాజమాన్యంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు, కార్తీక్, శంకర్, యాదయ్య, కత్తుల శివ, బొజ్జ నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు ఐద్వా మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా తొమిదిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణా రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి సోమవారం ఒక ప్రకటవిడుదల చేశారు. ప్రభుత్వ రంగసంస్థలను కారుచౌకగా అంబానీ, ఆదాని లాంటి ప్రయివేటు సంస్థలకు కేంద్రం అమ్మేస్తున్నదని తెలిపారు. దేశానికి నవరత్నాలుగా భావించే సింగరేణి, రైల్వేలు, ఎల్ఐసి, జిఐసి, మైనింగ్, ఆయిల్, ఉక్కు మొదలగు విలువైన దేశ సంపదను ప్రయివేటువరం చేస్తున్నదని పేర్కొన్నారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలిస్తామన్న కేంద్రప్రభుత్వం..ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నదని విమర్శించారు. ప్రధానంగా, మహిళలు ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలు సామాన్యుల ఆకలి చావులకు కారణమవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని మల్లు లక్ష్మి కోరారు.

ఫొటో: సభలో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

సార్వత్రిక సమ్మెతో మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

- జిఒ 282ని వెంటనే ఉపసంహరించుకోవాలి
- సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా ఈ నెల తొమ్మిదిన చేపట్టబోయే సార్వత్రిక సమ్మెతో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, దానికోసం కార్మికులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీచౌక్, మార్కెట్ కార్మికులతో తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం కోరుతూ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం పనిచేస్తున్నదే తప్ప కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని అన్నారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు.. లాంటివి లేబర్ కోడ్‌ల ద్వారా కాలరాయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8గంటల పనిని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేశారని ఆరోపించారు కులం, మతం, అస్తిత్వ భావజాలంతో కార్మికోద్యమం దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్పొరేట్‌లకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారన్నారు. కార్మికులు ఐక్య పోరాటలకు సిద్ధం కావాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 282ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, నాయకులు వై.విక్రమ్, భూక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, సీఐటీయూ త్రీ టౌన్ కన్వీనర్ యర్రా మల్లికార్జున్, సిటీ హమాలి యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.